55 మందికి ఉద్యోగోన్నతులు : జెడ్‌పి ఛైర్‌పర్సన్

ఏలూరు సిటీ : జిల్లా ప్రజా పరిషత్ ఆధీనంలో ఉన్న వివిధ క్యాడర్లలో పని చేస్తున్న 55 మంది సిబ్బందికి ఇప్పటివరకు వివిధ విభాగాల్లో ఉద్యోగోన్నతులు కల్పించినట్లు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. జిల్లా పరిషత్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కారుణ్య నియామకం ద్వారా 55 మందిని ఒకేసారి నియమించడం రాష్ట్ర చరిత్రలోనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. కోవిడ్ సమయంలో ఉద్యోగులు మరణించడం వల్ల వారి కుటుంబాలు చిన్నాభిన్నమై అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం వారసులకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. తాను ఉద్యోగ కాలం చేపట్టిన వెంటనే ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న రికార్డ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించామని తెలిపారు. అంతేకాకుండా మరణించిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకం ద్వారా వారి జాబితాను ఎప్పటికప్పుడు భర్తీ చేయడం కోసం చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

కష్టాల సాగు..!

- భారీగా పెరిగిన దాళ్వా పెట్టుబడి
- భారంగా ఎరువులు, పురుగు మందుల ధరలు
- ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి
- వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం అంతంతమాత్రమే
- తగ్గుముఖం పడుతున్న వరి సాగు
- కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం
- ప్రభుత్వం దృష్టి సారించకపోతే సాగు ప్రశ్నార్థకమే

ప్రజాశక్తి - భీమవరం

రైతన్న కష్టమంతా పెట్టుబడికే సరిపోతోంది. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలు, ఇతర భారాలు రైతులను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెడుతున్న రైతన్నకు ఆశాజనకంగా పంట పండితే రూ.50 వేల వరకూ వస్తుంది. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ మొత్తాన్ని చేతికి రానీయడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి రైతులతోపాటు కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రైతులకు ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందించకపోవడంతో కష్టనష్టాల నడుమ దాళ్వా సాగు ముందుకు సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో సార్వా సాగుకు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక రూపొందించినప్పటికీ దాన్ని రైతులు అందిపుచ్చుకొనే పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల 14 వేల ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో ఈ ఏడాది దాళ్వాసాగు చేపట్టారు. అయితే గతేడాది డిసెంబర్ నెలాఖరు నాటికి నాట్లు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే ఈ ఏడాది జనవరి నెలాఖరైనా నాట్లు ప్రక్రియ పూర్తిస్థాయిలో పూర్తి కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో 85 శాతం, ఏలూరు జిల్లాలో 75 శాతం మాత్రమే నాట్లు ప్రక్రియ పూర్తయ్యింది. ఏటా ముందస్తు సాగుకు సన్నద్ధం కావాలంటూ వ్యవసాయ శాఖ ప్రచారాలు చేయడమే తప్ప దానిపై దృష్టి సారించి ఫలితాలు రాబట్టడంలో విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు సాగునీటి సమస్య ప్రధానంగా వేధిస్తోంది. సాగునీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందించినప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. మరికొన్ని రోజుల్లో వంతుల వారీ విధానం అమలు జరిగే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో శివారు ప్రాంత పొలాలకు నీరందే పరిస్థితి లేదు. దీనికితోడు సాగులో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. రెండు జిల్లాల్లో సుమారు 7 లక్షల మంది రైతులుండగా వారిలో సుమారు 4 లక్షల మంది వరకూ కౌలురైతులే ఉన్నారు. నూటికి 80 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. గతంతో పోలిస్తే యాంత్రీకరణ పెరగడం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగాయి. గతంతో పోల్చితే యూరియా బస్తాపై రూ. 30 నుంచి రూ.50 వరకూ అదనంగా పెరిగింది. దీనికితోడు పురుగు మందుల ధరలు కూడా పెరిగాయి. దీంతో పెట్టుబడులకు తగ్గ ఆదాయం రాకపోవడంతో రైతులు సాగుకు దూరమవుతున్నారు. ఎకరాకు సరాసరి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరాకు రూ.50 వేల వరకూ వస్తున్నప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే రైతుల చేతికి అందే పరిస్థితి నెలకొంది. అదీ ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా పంట సంపూర్ణంగా చేతికి అందితేనే. కొన్ని పరిస్థితుల్లో పెట్టిన్న కూడా రైతులకు వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుర్తింపు కార్డులు లేక, రుణ సాయం, నష్టపరిహారం, బీమా వంటివేమీ వీరికి అందడం లేదు. జిల్లాలో నరసాపురం, యలమంచిలి, పాలకోడేరు, గణపవరం, భీమవరం రూరల్ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ భూములు బీడుగా వదిలేస్తున్నారు. గతేడాది సార్వాలో 20 వేల హెక్టార్లలో సాగు చేయకుండా వదిలేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అంతంత మాత్రంగానే ప్రభుత్వ ప్రోత్సాహం..

ప్రభుత్వ లబ్ధి భూయజమాని అంగీకారం లేకపోవడంతో కౌలురైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అయితే ఎక్కువ శాతం కౌలురైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి సాయం అందించడంలో ప్రభుత్వాలు వెనుకంజలోనే ఉన్నాయి. ప్రభుత్వం అందించే లబ్ధిలోనూ సవాలక్ష నిబంధనలు పెట్టి అసలైన సాగుదారునికి అన్యాయం చేస్తున్నారు. సాగులో ప్రధానపాత్ర పోషించే యాంత్రిక పనిముట్లకు ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం రూ.25 కోట్ల వరకూ బడ్జెట్ కేటాయించినప్పటికీ అతీగతీ లేకుండాపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా వ్యవసాయానికి నిధుల కేటాయింపుపై సరైన స్పష్టత ఇవ్వలేదు. కేవలం రైతులకు అందించే సాయాన్ని మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకున్నారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నామని చెప్పుకునేందుకు 28 డ్రోన్లు ఏర్పాటు చేసి రైతులకు శిక్షణ అందించారు. నమో దీదీ కార్యక్రమంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు కేవలం 6 డ్రోన్లు మాత్రమే అందించారు. దీంతో రాను రాను వరిసాగు తగ్గుముఖం పడుతున్న పరిస్థితి ఉంది. ఇంకా కౌలు రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు. భూమి లీజులు ఒక ప్రాంతంలో ఒకలా వేరే ప్రాంతాల్లో మరోలా ఉంది. మరికొన్ని చోట్ల కౌలు రేటు పెరిగిందని చెబుతున్నారు. వరిసాగు చేసే వారు లేక కౌలు రేటు తగ్గితే బాగా పండే చోట అధికంగా ఉందని తెలుస్తుంది. అయితే ఏడాది పాటు మొత్తం వ్యవసాయం చేస్తున్నా రూ.20 వేల ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

ఎకరానికి పెట్టుబడి ఖర్చులు ఇలా

నారుమడికి రూ.1,800, దమ్ముకు రూ.నాలుగు వేలు, గట్టులంకకు రూ.1,400, బాగుచేతకు రూ.1,400, నాట్లు వేయడానికి రూ.ఆరు వేలు, కలుపుతీతకు రూ.1,800, ఎరువులకు రూ.ఏడు వేలు, పురుగు మందులు రూ.6,800, మాసూలు కూలీలకు రూ.3,300, మాసూళ్లకు రూ.7,400 మొత్తం కలిపి ఆయా ప్రాంతాలను బట్టి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి అవుతుంది.

భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు కార్డులివ్వాలి

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలు రైతు సంఘం పశ్చిమ జిల్లా కార్యదర్శి

జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. దీనిలో కేవలం 92 వేల మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు. దీనిలో వందకు 30 శాతం కౌలు కార్డులు భూ యజమానుల చేతుల్లోనే ఉంటాయి. కౌలు రైతులకే కార్డులు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతుంది. దీనికి భూ యజమానులు ఒప్పుకోవడం లేదు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. భూ యజమానులతో సంబంధం లేకుండా ఇ - పంటలో కౌలు రైతు పేరు నమోదు చేయాలి. వాస్తవ కౌలుదారులకు కార్డులు మంజూరు చేయాలి. సాగులో కౌలురైతులు ఆర్థికంగా అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో పంట నమోదు చేయనీయడం లేదు. రాయితీలన్నీ భూ యజమానులకు వర్తిస్తున్నాయి. కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఎరువులు, పురుగు మందుల నకిలీలను అరికట్టాలి.

కలెక్టరేట్ వద్ద దీక్షలు చేస్తున్న విఒఎలు

తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలి

కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో అక్రమంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు మంగళవారం నిర్వహించారు. అన్యాయంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 నెలల వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని, విఒఎలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని పెద్దఎత్తున నినదించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న విఒఎలను రాజకీయ వేధింపులకు గురిచేస్తూ, అక్రమంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటూ స్వయంగా అధికార పార్టీ నాయకులే అక్రమంగా విఒఎలను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులే నేరుగా వెళ్లి తెల్లకాగితాలపై సంతకాలు చేయించి, గ్రూపుల ఆమోదం తీసుకోకుండా, గ్రామ సంఘం సమావేశాలు ఏర్పాటు చేయకుండా విఒఎలను తొలగించడం దుర్మార్గమన్నారు. అనేక చోట్ల విఒఎలను విధుల్లోకి తీసుకోవాలని కోర్టులు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లకు కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8 నెలలుగా వేతనాలు లేక విఒఎలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విఒఎలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎం.ఆమని, మరియమ్మ, బి.ఆదిలక్ష్మి, ఎం.ఇందిర, డి.కుమారి, టి.విమల, ఎ.రాజ్యలక్ష్మి, రాధారాణి, నాగ దుర్గాదేవి, సిహెచ్.జ్యోతి పాల్గొన్నారు.

మరో ఇద్దరు మృతి

అగ్ని ప్రమాద ఘటనలో నలుగురికి చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - మండవల్లి

గ్యాస్ లీకై ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. శుక్రవారం రాత్రి ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇప్పటికే ఆదివారం ఉదయం ఒక బాలుడు, సోమవారం ఒక యువకుడు మృతి చెందగా, మంగళవారం మరో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండవల్లి మండలం పత్తిపాటి స్టేజీ వద్ద ఈ నెల 24వ తేదీ శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పది తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు గాయాలపాలయ్యారు. వైద్యం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున బాలుడు విక్కీ (4) మృతి చెందాడు. నక్కల చరణ్ కిరణ్‌ను పరిస్థితి విషమించడంతో బంధువులు మెరుగైన వైద్య నిమిత్తం మద్రాసులోని వేలూరు ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి 10:30 గంటలకు నక్కల చరణ్ (19) మృతి చెందాడు. మంగళవారం ఉదయం 4 :20 నిమిషాలకు నక్కల కార్తీక్ (17), డబ్బా పాప 6.00 చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గుంటూరులో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతి చెందడంతో నక్కల వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వేలేరు చేరుకుని మృతదేహాలకు పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

విధిగా హెల్మెట్ ధరించండి

హెల్మెట్ ధారణపై అవగాహన, బైక్ ర్యాలీలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎ చంటి

ప్రజాశక్తి - ఏలూరు

వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏలూరులో చేపట్టిన బైక్ ర్యాలీని స్థానిక పోలీస్ పెట్రోల్ బంకు వద్ద కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. శ్రద్ధ వహించండి అనే నినాదంతో రోడ్డు భద్రతపై నెలరోజుల పాటు ప్రతిరోజూ వివిధ రూపాల్లో అవగాహన కలిగించే అంశాలపై రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతినెలా జిల్లా స్థాయిలో రోడ్డు భద్రతపై సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏడాది కాలంలో 595 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 290 మంది మృతి చెందారని, మరో 628 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా రోడ్డు భద్రత నిబంధనల మేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. హెల్మెట్ ధరించని వారిపై అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. పరిస్థితులను బట్టి వారి 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్సులు కూడా రద్దు చేయడం జరుగుతుందన్నారు. హెల్మెట్ ధరించాల్సిన అవసరం, ధరించకుండా సంభవించే దుష్ప్రభావాలపై వాహనదారుల్లో అవవగాన కలిగించడం జరుగుతుందన్నారు. మొదటిసారిగా వెయ్యి రూపాయలు జరిమానా కలెక్టరేట్‌తోపాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ద్విచక్ర వాహనం కలిగిన ప్రతి ఉద్యోగి హెల్మెట్ ధరించి కార్యాలయాలకు హాజరు కావాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాప్రాయం నుంచి బయటపడొచ్చన్నారు. ప్రస్తుతం వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ రద్దీ ఎక్కువ కావడంతో రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని, ఈ దృష్ట్యా ప్రజల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ర్యాలీలో నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, ఇన్‌ఛార్జి ఉపరవాణా కమిషనర్ కెఎస్ఎంవి.కృష్ణారావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, డిఎంహెచ్‌ఒ మాలిని, అదనపు డిఎంహెచ్‌ఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కాంగ్రెస్ నేత నరసింహమూర్తి ఇంటిపై దాడి దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాంగ్రెస్ దెందులూరు నియోజకవర్గ నాయకులు ఆలపాటి నరసింహమూర్తి ఇంటిపై కొందరు వ్యక్తులు దాడి చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలోనూ అయనపై పలుమార్లు దాడులు జరిగాయని పేర్కొన్నారు. అప్పుడు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో గన్‌మ్యాన్‌ను కేటాయించినట్లు తెలిపారు. మళ్లీ సోమవారం పెదవేగి మండలం ముండూరులోని ఆయన ఇంటిపై దాడి చేసి ఆయన లేకపోవడంతో ఎన్నికల ప్రచార రథాన్ని, కారు అద్దాలను పగలగొట్టి భయాందోళనలు సృష్టించారని, ఆయన భార్యను బెదిరించారని వచ్చిన వార్తల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. దళితుల శ్మశాన భూమి ఆక్రమణ, చెరువు భూమి ఆక్రమణ చేసి కబ్జా చేయడాన్ని ప్రశ్నిస్తున్న ఆలపాటి నరసింహమూర్తిపై, దళితులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం సహించరాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ముండూరులో ఆక్రమణకు గురైన దళితుల శ్మశానభూమి, ప్రభుత్వ చెరువు భూములను సర్వే చేసి కబ్జాదారుల నుంచి కాపాడాలని, ప్రభుత్వ భూములు పేదలకు దళితులకు పంపిణీ చేయాలని తెలిపారు. దాడి ఘటనపై పోలీసుల ఉదాసీన వైఖరి వీడనాడాలని పేర్కొన్నారు. గ్రామంలోని భూ సమస్య విషయంలో పేదలకు, దళితులకు సిపిఎం అండగా నిలుస్తుందని తెలిపారు.

1/70 చట్టం జోలికి వస్తే సహించం

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం కేంద్రంగా నిర్వహించిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం సవరణ ద్వారానే ఏజెన్సీ ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తాయని, అవకాశాలు ఉంటాయని స్పీకర్ వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని పాలకులు నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వాలే టూరిజం పేరుతో వందలాది ఎకరాల భూములను ఆక్రమించారని, 1/70 చట్టాన్ని సవరించాలని వాఖ్యనించడం రాజ్యాంగ హక్కులను, ఆదివాసీ చట్టాలను ధిక్కరించడం అవుతుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చిన్న తరహా పరిశ్రమలను ఐటిడిఎ ద్వారా ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్నారు.

దళిత చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దళితుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో దళితులు రెవెన్యూ అధికారులకు పెట్టుకున్న అర్జీలు పరిష్కారం కావడంలేదని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ సమావేశం పల్లి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గతంలో జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో ముప్పిడి రాజును అత్యంత దుర్మార్గంగా హత్య చేసి చెరువులో పడేస్తే ప్రజా ఉద్యమాల చేయడంతో 2021 ఆగస్టు 14వ తేదీన కేసు పెట్టారని, కాని ఇప్పటికీ ఆ హత్యకు సంబంధించిన పోస్టుమార్టం రిపోర్ట్ ఇవ్వలేదని తెలిపారు. ఆ కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చి, ఉద్యోగం, తల్లికి పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, నాలుగున్నరేళ్లు అవుతున్నప్పటికీ ఆ హామీ నెరవేరలేదని చెప్పారు. కేసు దర్యాప్తు చేసి నిజమైన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల 2024 డిసెంబర్ 29వ తేదీన జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురంలో దళిత యువకులను కర్రలతో కొట్టి, కత్తితో నరికినవారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. దళితుల పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారన్నానరు. దళితులపై దాడి చేసి హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని, లేకపోతే మానవ హక్కుల కమిషన్ న్యాయ హోం మంత్రిని ఎస్‌సి కమిషన్ కలిసేందుకు ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బాధితులు మనల్లి నాగేశ్వరరావు, ముప్పిడి ఏసు, ఎం.వెంకట్రావు, కె.సుబ్బారావు, మరియమ్మ, నాగార్జున, బాబురావు పాల్గొన్నారు.

వివాదంలో నిరాశ్రయుల హాస్టల్ నిర్వహణ

వసతి గృహానికి తాళాలు వేసిన మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తాళాలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహం నిర్వహణ వివాదంగా మారింది. ప్రస్తుత నిర్వాహకులను అక్కడి నుంచి ఖాళీ చేయాలని, వసతి గృహాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలని మంగళవారం మున్సిపల్ అధికారులు ఒత్తిడి చేయడం, తమకు మున్సిపాలిటీ నుంచి రూ.18 లక్షలు రావాలని, కొంత సమయం కావాలని నిర్వాహకులు అడగటం, అధికారులు ససేమిరా అనడంతో పాటు పోలీసుల సహాయంతో వసతి గృహంలోని మేనేజర్ గదికి, స్టోర్ రూమ్‌కు తాళాలు వేసిన పరిస్థితి నెలకొంది. వివరాల ప్రకారం... పత్తేబాద రైతు బజార్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో 1998లో అప్పటి రాజ్యసభ సభ్యులు పర్వతనేని ఉపేంద్ర లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్ నిధుల నుంచి కొంత సొమ్ము కేటాయించగా మరికొంత మున్సిపల్ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మించారు. అనంతరం 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహంగా ఆ కమ్యూనిటీ హాల్‌ను మార్చి నిరాశ్రయులకు వృద్ధులకు వసతి కల్పిస్తున్నారు. 2016-2017 సంవత్సరాల్లో వేరే వ్యక్తులు ఆ వసతి గృహాన్ని నిర్వహించగా 2017 జనవరి నుంచి మదర్‌థెరిస్సా సేవా సంఘం నిర్వాహకులు రాయి మంగరాజు మెప్మాతో ఒప్పందం చేసుకుని వసతి గృహం నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. మంగరాజు భార్య రాయి విమలాదేవి అప్పట్లో కార్పొరేటర్ కావడంతో అప్పటి స్థానిక ప్రజాప్రతినిధి సహకారంతో వసతి గృహ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అందుకు సంవత్సరానికి రూ.ఆరు లక్షలు మెప్మా నుంచి ఖర్చుల నిమిత్తం నిర్వాహకులకు ఇవ్వటం జరుగుతుంది. అయితే 2021 నుంచి అప్పటి వైసిపి ప్రభుత్వంలో మంగరాజుకు మెప్మా నుంచి ఎలాంటి ఒప్పందం చేయలేదు. అయినప్పటికీ ఎప్పటికైనా ఒప్పందం అవుతుందనే, బిల్లులు వస్తాయనే ఉద్దేశంతో గత మూడేళ్లుగా ఆయన సొంత డబ్బులతో వృద్ధుల ఆశ్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం వసతి గృహంలో 45 మంది వృద్ధులు ఉన్నారు. ప్రతి సంవత్సరం ఒప్పందాన్ని రెన్యువల్ చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ 2021 నుంచి రెన్యువల్ చేయలేదని, తెలుగుదేశం ప్రభుత్వంలో తమకు ఈ వృద్ధుల వసతి గృహాన్ని కేటాయించడంతో కావాలనే వైసిపి హయాంలో మెప్మా పీడీ తమకు రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వలేదని మంగరాజు తెలిపారు. గత మూడు నెలలుగా తమను అక్కడి నుంచి ఖాళీ చేసి వసతి గృహాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, 2021 నుంచి తమకు రూ.18 లక్షలు రావాల్సి ఉందని, పచారీ సరుకుల కోసం, ఇతర అవసరాల కోసం అనేక చోట్ల అప్పులు చేసి వసతి గృహాన్ని నిర్వహిస్తున్నామని, తమకు రావాల్సిన సొమ్ములు చెల్లించకుండా ఖాళీ చేయమంటే ఎలా అని మంగరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి పిఒ కృష్ణమూర్తి తన సిబ్బందితో వచ్చి వసతి గృహాన్ని ఖాళీ చేయాలని నిర్వాహకులకు చెప్పటంతో తమకు ఎలాంటి నోటీసు రాలేదని, ముందు నోటీస్ ఇస్తే దానికి తగిన సమాధానం ఇస్తామని మంగరాజు తెలిపారు. 2021 నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా వసతి గృహాన్ని నిర్వహిస్తున్నందున నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని కృష్ణమూర్తి తెలిపారు. కనీసం నెలరోజులు సమయం ఇవ్వాలని నిర్వాహకులు కోరగా పిఒ కుదరదని చెప్పారు. అయినప్పటికీ మంగరాజు కుటుంబ సభ్యులు వసతిగృహాన్ని ఖాళీ చేయకపోవడంతో పోలీసుల సహాయం తీసుకుని మేనేజర్ రూమ్‌కు, స్టోర్ రూమ్‌కు తాళాలు వేసి సీల్ వేశారు. దీంతో చేసేది లేక మంగరాజు కుటుంబ సభ్యులు మౌనంగా ఉండిపోయారు. ఈ విషయంపై పిఒ కృష్ణమూర్తిని వివరణ కోరగా 2021కి వీరికి ఇచ్చిన సమయం అయిపోయిందని, అక్కడి నుంచి ఎలాంటి ఒప్పందం లేనందున ఖాళీ చేయిస్తున్నామని తెలిపారు. మూడేళ్ల నుంచి ఎలాంటి ఒప్పందం లేకుండా వసతి గృహాన్ని నిర్వహిస్తుంటే మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని, అందుకే పట్టించుకోలేదని సమాధానం ఇచ్చారు. సాయంత్రం నుంచి వృద్ధులకు భోజనం ఎవరు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించగా మున్సిపాలిటీ నుంచే వారికి భోజనం ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ఉత్సవ కమిటీ ఛైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ శ్రీవీరేశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చే యాత్రికులకు విస్తృత సౌకర్యాలు కల్పించే విషయంపై ఈ నెల 29వ తేదీ బుధవారం ఉదయం పది గంటలకు పట్టిసీమ గ్రామసచివాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవ కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 27 వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిపారు. ఈ దృష్ట్యా సంబంధిత అధికారులందరూ సదరు సమావేశానికి హాజరు కావాలని ఆర్‌డిఒ కోరారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పోలవరం పంచాయతీ పరిధి కొత్తపేటలో రెండు వేర్వేరు పక్కా డ్రెయినేజీల నూతన నిర్మాణ పనులకు మంగళవారం పంచాయతీ సర్పంచి పొదుం వువ్వు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిలో భాగంగా పంచాయతీ నిధుల రూ.పది లక్షలతో ఒక పక్కా డ్రెయినేజీ, ఎంపీ నిధుల రూ.పది లక్షలతో ఒక పక్కా డ్రెయినేజీ కొత్తపేటలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్మించనున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధితో పాటు పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనుల పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

ఎస్ఐ, ఎఎస్ఐలకు సన్మానం

ప్రజాశక్తి - చాట్రాయి

మండల పరిధిలో దొంగతనాల కేసులను సమర్థవంతంగా ఛేదించి నిందితులను పట్టుకున్నందుకు, నకిలీ స్వామీజీని వ్యూహాత్మకంగా పట్టుకున్నందుకు చాట్రాయి ఎస్ఐ డి..రామకృష్ణను, సహకరించిన ఎఎస్ఐ గజపతిని ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు మంగళవారం సన్మానించారు. ఇటీవల మండలంలో ఇతర ప్రాంతం నుంచి వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నవారిని, ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగిస్తూ వేలకు వేలు డబ్బులు స్వాహా చేస్తూ పారిపోతున్న నకిలీ స్వామీజీని తన సిబ్బంది సహకారంతో పట్టుకుని అరెస్టు చేసిన ఎస్ఐ డి.రామకృష్ణకు గణతంత్ర దినోత్సవం పండుగ సందర్భంగా రివార్డు ప్రకటించారు. ఈ రివార్డును కలెక్టర్ చేతుల మీదుగా ఎస్ఐ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎస్ఐను, ఎఎస్ఐను సత్కరించారు.

మూగ జీవాలకు నట్టల నివారణ మందులు

ప్రజాశక్తి - ముసునూరు


శిబిరంలో రైతులు

మూగ జీవాలకు రోగ నిరోధక శక్తి మాత్రలు వేస్తే జీవాలు ఆరోగ్యకరంగా ఉంటాయని చిల్లబోయినపల్లి గ్రామ సర్పంచి కండెపు రామగిరిరావు అన్నారు. మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామ సచివాలయంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందించినట్లు వైద్యులు ఎం.వెంకటచైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలని ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, విద్యార్థుల ఆత్మహత్యలు నివారించాలని, విద్యార్థుల మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలు విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులు గురిచేస్తూ, ర్యాంకుల కోసం విద్యార్థులపై మధ్య ఒత్తిడి సృష్టిస్తూ విద్యార్థుల మరణాలకు కారణమైన కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పరీక్షల దగ్గరకు వస్తున్న నేపథ్యంలో అనంతపురం నారాయణ కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థిని తరగతి గది ముందు నిలబెట్టడంతో విద్యార్థి మనస్తాపానికి గురై అక్కడికక్కడే మూడో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.యశ్వంత్, సొంగా సునీల్ కుమార్, నగర ఉపాధ్యక్షుడు వై.శాంతికిరణ్, ఎ.తేజ, నగర కమిటీ సభ్యులు ఎస్.కె.హర్షద్ పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారంలో మోడీ విఫలం

ప్రజాశక్తి - చింతలపూడి

నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని సిపిఐ పాత చింతలపూడి శాఖ మహాసభ బోడ వజ్రం అధ్యక్షతన ముల్లగిరి నాగేశ్వరరావు ఇంటి వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ 2014 ముందు తాను అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేసిన మోడీ ఆ హామీని ఇప్పటికీ నిలబెట్టుకోలేదన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కరెంటు ఛార్జీలను పెంచిందన్నారు. అనంతరం శాఖ కార్యదర్శిగా ముల్లగిరి నాగేశ్వరావును, సహాయ కార్యదర్శిగా తొర్లపాటి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ శాఖ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సిపిఐ శాఖ కార్యదర్శి ముల్లగిరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపిటిసి గౌరవ వేతనాల బిల్లులు పెట్టాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలో ఎంపిటిసి సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించి బిల్లులను ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి పెట్టామని దెందులూరు ఎంపిడిఒ కె.శ్రీదేవి అన్నారు. ప్రభుత్వం నుంచి ఎంపిటిసి సభ్యుల గౌరవ వేతనం బిల్లలు మంజూరైన వెంటనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని, ఎంపిటిసి సభ్యులందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బల్లలు, కుర్చీలు

ప్రజాశక్తి - చింతలపూడి

అంగన్వాడీ సెంటర్ల అభివృద్ధే లక్ష్యంగా ఉమ్మడి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ అన్నారు. మండలంలోని పాత చింతలపూడి గ్రామంలో అంగన్వాడీ సెంటర్‌లో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ చొరవతో ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు వచ్చిన బల్లలు, కుర్చీలు, ఆట వస్తువులు ఇతరత్రా సామగ్రిని చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ హెప్సిబా, టిడిపి నాయకులు కొక్కిరిగడ్డ బాబ్జి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బోడ స్వాతి, అంగన్వాడీ హెల్పర్ కమల, బత్తుల మల్లేష్, పుష్ప పాల్గొన్నారు.

కొల్లేరులో చెరువు గట్లకు గండ్లు

వన్యప్రాణి విభాగం రేంజ్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి

ప్రజాశక్తి - దెందులూరు

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరు అభయారణ్యంలో సాగులో ఉన్న చెరువుల గట్లకు గండ్లు పెడుతున్నట్లు వన్యప్రాణి విభాగం రేంజ్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి చెప్పారు. మంగళవారం కొల్లేరు పరిధిలోని శ్రీపర్రు, మానూరు గ్రామాల పరిధిలోని చెరువులకు ఆమె దగ్గరుండి గండ్లు పెట్టించారు. వంద ఎకరాలు మించిన చెరువులకు గండ్లు పెట్టించారు. ఫిబ్రవరి ఎనిమిదో తేదీ సుప్రీంకోర్టు నియమించిన కమిటీ వచ్చేలోగా కొల్లేరులోని 17 వేల ఎకరాల గట్లకు గండ్లు పెడతామని, ఇప్పటికే ఏలూరు జిల్లాలో ఆరు వేల ఎకరాల్లో గండ్లను కొట్టినట్టు చెప్పారు.

నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - కలిదిండి

అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను నిధులు కేటాయించాలని మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందించినట్లు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ్రాజు శ్రీనివాసరావు తెలిపారు. ఉండవల్లిలోని మంత్రి నివాసం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ విషయమై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని అంగ్రాజు శ్రీనివాసరావు అన్నారు.

'కృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం హర్షణీయం'

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రతిభ కలిగిన వ్యక్తులకు, సమాజ సేవ చేసిన వ్యక్తులకు గుర్తింపే పద్మశ్రీ అవార్డు పురస్కారమని ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులు మొలుగుమాటి రవి రాం అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు, జాతీయ నాయకుడు మందా కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ఇచ్చి సత్కరించిన సందర్భంగా మంగళవారం ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు చాట్రాయి సెంటర్‌లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకుడు మాజీ సర్పంచి గార్లపాటి మారేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు దుర్గం పుల్లారావు, మాజీ సర్పంచి కోట జోషి, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పెదపాడులో రూ.12.40 కోట్లతో పలు అభివృద్ధి పనులు

జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

మాట్లాడుతున్న పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పెదపాడు మండలంలో రూ.12.40 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేశామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యాలయం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధులు రూ.12.40 కోట్లతో రహదారులు, మురుగు కాలువలు, రిటైనింగ్ వాల్స్, తదితర అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. మండల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ధాన్యం డబ్బుల కోసం ఎంతో వ్యయ ప్రయాసలు పడేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 24 గంటల్లో ధాన్యం డబ్బులు చెల్లిస్తామని చెప్పినా కేవలం నాలుగు గంటల్లోనే అందిచిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలవలకు నీరు విడిచిపెట్టిన వెంటనే ఆయా గ్రామ సర్పంచులు మంచినీటి చెరువులను నింపుకోవాలని చెప్పారు. గతంలో అభివృద్ధి పనులు చేసినా సకాలంలో బిల్లు చెల్లించక కాంట్రాక్టర్లు ఎంతో ఇబ్బంది పడేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో త్వరిత గతిన చెల్లింపులు జరగడంతో పనులు కూడా వేగవంతమవుతున్నాయని తెలిపారు.

భీమడోలు :గ్రామాలాభివృద్ధికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పటిష్టమైన గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారుచేసి అమలు చేయడం ముఖ్యమని ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రిసోర్స్‌గా ఎంపిడిఒతో పాటు సహాయ రిసోర్స్ అధికారిగా ఇన్‌ఛార్జి పంచాయతీ విస్తరణ అధికారి వెంకటరావు వ్యవహరించగా, రిసోర్స్ పర్సన్‌గా అంబర్‌పేట పంచాయతీ కార్యదర్శి వెంకట్రావుతో పాటు, సూరప్పగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.ముత్తయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామపంచాయతీ సచివాలయ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన ఎంపిడిఒ పద్మావతి దేవి మాట్లాడుతూ గ్రామపంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ఆదాయం సంపాదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, మండల పరిషత్ అధ్యక్షులు కె.రామయ్య(ఆదాం) పాల్గొన్నారు.

పోలవరం : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల సమైక్య (వెలుగు) కార్యాలయంలో పోలవరం ఎంపిడిఒ శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొని మహాత్మా గాంధీ, బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ సిహెచ్.శ్రీనివాస్ బాబు, వైస్ ఎంపిపి మీడియం సింగరాజు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ వెంకటేశ్వరరావు, సర్పంచులు మైగాపుల విజయ దుర్గ, సబ్బారపు, శ్రీరామ్మూర్తి, ఎంపిటిసి సభ్యులు వలవల వరలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ సలాం, మండల పరిషత్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం :గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఎంపిడిఒ మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎంపిడిఒ మణి కుమారి అధ్యక్షతన మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ గ్రామ పంచాయతీల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి దోహదపడుతుందని ఆమె తెలిపారు.

జీలుగుమిల్లి :గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పని చేయాలని ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై ప్రజా ప్రతినిధులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఇఒపిఆర్‌డి నిఖిల్ మధుశరణ్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో గ్రామ పంచాయతీ పాత్ర, ఆదాయ వనరులు, సమీకరణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్ డి.నిఖిల్ మధు శరణ్, ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంతరావు, మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు జనవరి 31 లోపు గ్రామస్థాయిలో సమగ్రంగా తయారుచేసి గ్రామ సభ ఆమోదంతో మండల పరిషత్ ద్వారా ప్రభుత్వానికి పంపించాలని ఉంగుటూరు ఎంపిడిఒ జిఆర్.మనోజ్ అన్నారు. మండల పరిషత్ కార్యాయంలో మంగళవారం జరిగిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి చంద్రశేఖర్, ఫ్యాకల్టీ మెంబర్ జివి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజశేఖర్ గెలుపునకు కృషి చేయాలి : బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు అందరూ సమిష్టి కృషి చేయాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పార్టీ శ్రేణులకు సూచించారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో బూత్ లెవెల్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఎల్‌ఎ బడేటి చంటి, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకులు వేపాడ చిరంజీవి, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి విజయవాడ జోన్ - 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి ఏలూరు నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, వందనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేంపాడు మేజర్ కాలువ పరిశీలన

ముసునూరు:రామచంద్రపురంహెడ్ రెగ్యులేటర్ వద్దకు 1700 వందల క్యూసెక్కులు తెలంగాణ నుంచి రావాల్సి ఉండగా కేవలం 800 క్యూసెక్కుల వరకు మాత్రమే నీరు వస్తుందని, దీంతో అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని వేంపాడు మేజర్ డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ తెలిపారు. వేంపాడు మేజర్ కాలువను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి 32.25 టిఎంసిలు సాగర్ జలాలు జోన్-2, జోన్-3లకు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 11 టిఎంసిలు సాగర్ జలాలు విడుదలయ్యాయని, ఇంకా 21 టిఎంసిలు సాగర్ జలాలు అందించాల్సి ఉందని తెలిపారు. ఆయనతో పాటు డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్లు గంధ్ర ప్రసాద్ (ఎర్రమాడు), తానూరు హనుమంతరావు (గంపలగూడెం), కటారి కోటేశ్వరరావు (కూనప రాజు పర్వ), గుమ్మడి వెంకట స్వామి (మైలవరం), కొల్లి వెంకట శ్రీనివాసరెడ్డి (రెడ్డిగూడెం), పామర్తి శ్రీనివాసరావు (నున్న), ఇనుగంటి శోభన్ బాబు (కోడూరు), కాపా రాంబాబు (జుజ్జురు), రాపర్ల బాలకృష్ణ (ముసునూరు), దేవినేని సత్యనారాయణ (మడిచర్ల) పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఏలూరు సిటీ:జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వైద్యాధికారిణి డాక్టర్ మాలిని ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీని డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలిని మాట్లాడుతూ ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించి బైక్ నడపాలని, ప్రమాదాలు జరగకుండా భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

2024లో సమ్మె సందర్భంగా ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటి వరకూ అమలు చేయకపోవడం దారుణమని ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ అన్నారు. మండలంలో ఆశావర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మండలాధ్యక్షురాలు సిహెచ్.పుణ్యవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, చనిపోయిన వారికి బీమా సౌకర్యం తదితర డిమాండ్లు సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించి నేటి వరకూ అమలు చేయలేదన్నారు. రానున్న కాలంలో వీటి పరిష్కారానికి మళ్లీ ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు వీడనాడాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించి అమలు చేయాలని నిర్ణయానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 5వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ మండల గౌరవ అధ్యక్షుడు బాలరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బి.సరళ, కోశాధికారి సంపూర్ణమ్మ, నాయకులు రాణి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, లెక్చరర్లకు శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి-2025లో భాగంగా ఫిబ్రవరి 1, 3 తేదీల్లో జరుగే క్వాలిఫైయింగ్ పరీక్షలైన ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్, ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షల గురించి, ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల గురించి మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, ఒకేషనల్ జూనియర్ లెక్చరర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిక్షల కమిటీ కన్వీనర్, ఆర్ఐఒ కె.చంద్రశేఖర్‌బాబు, జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్, డివైఇఒ బి.ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ క్వాలిఫై పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ ఇస్తారని, ఈ పరీక్షలు జిల్లాలోని 137 కేంద్రాల్లో 18,453 మంది విద్యార్థులకు వారు చదువుతున్న కళాశాలలోనే నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కె.యోహాన్, ఎల్.శ్యాంకుమార్, బివి.శ్రీనివాస్, పిజ్యోతి, కె.మురళీ మోహనకృష్ణ, జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్, ఒకేషనల్ లెక్చరర్లు పాల్గొన్నారు.

కైకరంలో ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

శిక్షణలో ఎన్‌సిసి క్యాడెట్లు

19 ఆంధ్రా బెటాలియన్ ఏలూరు వింగ్ ఎన్‌సిసి క్యాడెట్లకు మంగళవారం ప్రాక్టికల్ పరీక్షలు కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షలకు, కైకరం నుంచి 64 మంది, గుండుగులను నుంచి 38 మంది, నల్లజర్ల ఎకెఆర్‌జె పాఠశాల నుంచి 64 మంది మొత్తం 166 మంది ఎన్‌సిసి క్యాడెట్లు హాజరయ్యారు. ఈ క్యాడెట్లు రెండేళ్ల పాటు మిలటరీ డ్రిల్ కమ్ ఆయుధ శిక్షణ, మాప్ రీడింగ్ ట్రైనింగ్ పొంది ఎన్‌సిసి-ఎ సర్టిఫికేట్ పొందటానికి ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రాక్టికల్ పరీక్షను లెఫ్టినెంట్ కల్నల్ రిబిష్ సిన్హా, ఇతర ఎన్‌సిసి అధికారులు పర్యవేక్షించారు. ఎన్‌సిసి అంటే స్వీయ క్రమశిక్షణకు మారుపేరని, వాటి ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కైకరం ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహణలో ఎన్‌సిసి ఆఫీసర్లు గొల్లపల్లి గవరయ్య, కెజి.భీమేశ్వరరావు, మహబూబ్‌వల్లి పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ప్రభుత్వాలు మారినా పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావడంలేదని సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి మడివి దుర్గారావు అన్నారు. మండలంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో కారం వెంకట్రావు అధ్యక్షతన మంగళవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో సిపిఎం రాష్ట్ర మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఐదు ప్రధాన సమస్యలపై చర్చించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పతాక యాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా విలీన మండలాల ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్న పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు రూపాకల్పన చేసేందుకు, జీపు జాత సిపిఎం పార్టీ తరఫున నిర్వహిస్తున్నామని, 29వ తేదీన కూనవరంలో ప్రారంభమై 30వ తేదీన వేలేరుపాడు చేరుతుందని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గుమ్మల నర్సయ్య, కుంజా దుర్గ, మాడి ప్రసాద్ రెడ్డి, శ్రీను, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌భాష

పలుచోట్ల పొలం పిలుస్తోంది కారక్రమాలు


ముదినేపల్లిలో...

ప్రజాశక్తి - ముదినేపల్లి

మినుము పైరులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ భాష అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు, కొర్రగుంటపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ భాషా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మినుము పంట వేసిన రైతులందరూ పల్లాకు తెగులు నివారణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణం పగలు వేడిగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉండి, మంచు పడుతున్నందున మినుము పైరులో బూడిద తెగులు వ్యాపించడానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. రైతులు దానిని గమనించుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమం అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండవల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, రెండు గ్రామాల సర్పంచులు దారం సుధ, పేరే రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు :వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి కోరారు. పాతూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో సాగుతున్న వరి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రైతులతో మమేకమై వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పైరు పిలకల దశలో ఉందని, ఈ నేపథ్యంలో అవసరం మేరకు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులను అవలంభించాలని కోరారు. దీనికోసం వ్యవసాయ శాఖ అందిస్తున్న సాయిల్ హెల్త్ కార్డుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా మంజూరైన 304 సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంట నమోదు కార్యక్రమాన్ని ఫిబ్రవరి 15వ తేదీ లోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరప్పగూడెం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకురాలు డి.షైలు భాను, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పోలవరం :మండలంలోని గూటాల-1, కొత్త పట్టిసీమ రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. వరి మొక్కజొన్న ఇతర పంట పొలాలను పరిశీలించి తెగులు సోకిన పంటలకు వేయాల్సిన మందుల గురించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :మండల పరిధిలోని మీర్జాపురంలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొక్కజొన్న, పామాయిల్ తోటలను నూజివీడు మండల వ్యవసాయ అధికారిణి ఎ.చాముండేశ్వరి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులు భూసార పరీక్ష ఫలితాల కార్డులను రైతులకు అందించి పోషక విలువల గురించి విశ్లేషించి అవగాహన కల్పించారు.

భీమడోలులో రాజశేఖర్ పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలి సభ్యునిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ మండలంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా భీమడోలులోని టిడిపి కార్యాలయంలో ఆయన ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని టిడిపి బూత్ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను టిడిపి నాయకులు కార్యకర్తలకు ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పరిచయం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ విజయానికి పట్టభద్రులు కృషి చేయాలని కోరారు.

3 వరకూ భీమడోలు రైల్వేగేటు మూసివేత

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు-పూళ్ల రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న 361 నెంబరు భీమడోలు రైల్వే గేటును రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతు పురస్కరించుకు మూసివేసే కార్యక్రమాన్ని వచ్చేనెల మూడో తేదీ వరకు కొనసాగించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. జాతీయ రహదారిని భీమడోలు గ్రామానికి అనుసంధానం చేసే రోడ్లు, భవనాలు శాఖకు చెందిన రోడ్డుపై భీమడోలు రైల్వే గేట్ ఉంది. ట్రాక్ అత్యవసర మరమతుల నిమిత్తం ఈనెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్లు అధికారులు తొలుత తెలిపారు. వివిధ కారణాల వల్ల మరమ్మతు కార్యక్రమం ఈ నెల 22వ తేదీన ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో అనుకున్న సమయానికి ట్రాక్ మరమ్మతులు పూర్తికాని కారణంగా రైల్వే గేట్ మూసివేత కార్యక్రమాన్ని ఫిబ్రవరి మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

తామర పురుగుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్.రాఘవేంద్రనాథ్ ఆధ్వర్యంలో తామర పురుగుల నివారణపై రైతులకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ మామిడి తోటలను ఆశించే తామర పురుగుల నివారణకు మిత్ర పురుగు శిలింద్రాలు వాడాలని రైతులకు సూచించారు. ఒకే రకమైన పురుగు మందులు వెంట వెంటనే పిచికారి చేయరాదని తెలిపారు. అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ కనకమహాలక్ష్మి రైతులు వాడుతున్న మందులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాడాల్సిన మందులను సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రెసిడెంట్ రాజబాబు, ఉద్యాన శాఖ అధికారిని ఆర్.హేమ, వ్యవసాయ శాఖ అధికారిని ఎ.చాముండేశ్వరి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, పెనుమంట్ర మండలం, మామూదురు గ్రామానికి చెందిన సత్తివాడ జగదీశ్వరరావు, తండ్రి: వెంకటేశ్వరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. మామూదూరు మా ఇంటి నుండి బ్రాహ్మణ చెర్వు మోటార్ సైకిల్ పై వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. పాస్‌పోర్ట్ నెంబర్ **V7811961** గల పాస్‌పోర్ట్ ఏవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

సత్తివాడ జగదీశ్వరరావు
తండ్రి : వెంకటేశ్వరరావు
మామూడూరు,
పెనుమంట్ర మండలం, ప॥గో॥ జిల్లా
సెల్: 90302 45917

దస్తావేజు పోయినది

నా క్లయింటు తాళ్ళ ముదునూరు గ్రామం, తాడేపల్లిగూడెం మండలం లో **R.S.No: 289/1** లో గల పంట భూమి తాడేపల్లిగూడెం **S.R.O** లో రిజిష్టర్ కాబడిన డాక్యుమెంట్ యొక్క **లింక్ డాక్యుమెంట్ నెం: 279/1963** లో రిజిష్టర్ కాబడి ది. 26-12-2024 సం॥ తేదీన సుమారు 11-00 గంటల సమయంలో పెంటపాడు గ్రామంలో జిరాక్స్ తీసుకొని వస్తుండగా సదరు డాక్యుమెంట్ పడిపోయినది. మేము ఎంత వెతికినా సదరు డాక్యుమెంట్ కనిపించి యుండలేదు. కావున ఎవరికైనా ఆ డాక్యుమెంట్ దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

క్లయింటు అడ్రస్:
తమ్మన శ్రీరామ మూర్తి
S/o వెంకట వరద మంగరాజు
డోర్ నెం: 10-20-26/1
తాళ్ళ ముదునూరుపాడు
తాడేపల్లిగూడెం మండలం
ప॥గో॥జిల్లా
సెల్: 94412 22380

అడ్వకేట్ అడ్రస్:
పి. ప్రవీణ్ ప్రకాష్
M.B.A.,LL.B.
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం
ప॥గో॥జిల్లా
సెల్: 83096 19225
95158 25368

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం. 58/2024

బిట్వీన్:
బొల్లా వీర వెంకట శ్రీనివాస్ ...వాది
వెర్సెస్
మద్దుల సత్య కిషోర్ ...ప్రతివాది

టు:
మద్దుల సత్య కిషోర్, తండ్రి: సూర్య ప్రభాకర్ రావు, ప్లాట్ నెం. 401, 3వ ఫ్లోర్, అమరావతి అపార్ట్‌మెంట్, సూర్యతేజస్ నగర్, పాలకొల్లు, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు దావాలో ప్రతివాది యైన మద్దుల సత్య కిషోర్ హాజరు నిమిత్తం **ది. 20-02-2025 సం॥రం తేదీకి** వాయిదా వేసి యున్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టువారి ఎదుట **ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా కానీ, మీ న్యాయ వాది గారి ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు దావా ముందు గ్రంథము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

యం. వెంకట రామిరెడ్డి
న్యాయవాది.
పాలకొల్లు, ప॥గో॥జిల్లా.

పాలకొల్లు
27-01-2025